నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 24 ఆగస్టు 2024 | SURYAPET

ఎన్ఎస్పీ భూములు, క్వార్టర్లు కాపాడాలి

- మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు

మాట్లాడుతున్న వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, ఆగస్టు 23 : ప్రజాప్రతినిధులు, అధికారుల చెర నుంచి ఎన్ఎస్పీ భూములు, క్వార్టర్స్ కాపాడాలని మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. మిర్యాలగూడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, అధికారులు సైతం ఎన్ఎస్పీ భూములను చెరబడుతున్నారని ఆరోపించారు. నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఇద్దరు మంత్రులు ఈ కబ్జాలకు కీలక సూత్రధారులని, ఇప్పుడు సాగర్‌లో, మిర్యాలగూడలో ఆ ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లో హైడ్రా ద్వారా కబ్జా చేసిన ఇండ్లను ఎలా కూలుస్తున్నారో, అలాగే నాగార్జునసాగర్ నుంచి ఖమ్మం వరకు ఉన్న నీటిపారుదల శాఖ భూముల్లోని అక్రమ కట్టడాలను కూల్చాలన్నారు. కబ్జా చేసి ప్రభుత్వ ఇండ్లను, స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రపల్లి గురవయ్య, వీటీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అరాచకాలను ఎండగట్టాలి

- ఉమ్మడి జిల్లా నేతల భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తిరుమలగిరిలో కాంగ్రెస్ మూకదాడిపై డీజీపీని కలిసి ఫిర్యాదు

హైదరాబాద్‌లో డీజీపీకి వినతి పత్రం ఇచ్చి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, గాదరి కిశోర్, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, బూడిద భిక్షమయ్యగౌడ్ తదితరులు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 23(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలతో భేటీ అయ్యారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో వచ్చిన నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో గురువారం చేపట్టిన రైతు రుణ మాఫీ ధర్నాలపై ఆరా తీశారు. ప్రజలు, రైతుల స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలగిరిలో కాంగ్రెస్ కార్యకర్తల దౌర్జన్య కాండపైనా చర్చించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అక్కడ జరిగిన దాడి తాలుకా విషయాలను వివరించినట్లు తెలిసింది. కేటీఆర్ స్పందిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ గూండాలు చేస్తున్న అరాచకాలను ఎక్కడికక్కడ ఎండ గట్టాలని సూచించారు. పార్టీ నేతలంతా సమన్వయంతో కలిసికట్టుగా పని చేస్తూ కాంగ్రెస్ దాడులను, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై కాంగ్రెస్ గుండాల దాడి, పోలీసులు పక్షపాత ధోరణిపై కేటీఆర్‌తో కలిసి జిల్లా నేతలు డీజీపీని కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, నోముల భగత్‌కుమార్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ దాడిపై విచారణ సజావుగా జరిగేనా?

- 50మందికిపైగా దాడికి దిగితే ఆరుగురిపైనే కేసు నమోదు
- బీఆర్ఎస్ నాయకులపైనా కేసులు
- టెంట్లు కూల్చిన పోలీసులను రక్షించే యత్నం?

సూర్యాపేట, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : రైతులందరికీ రుణమాఫీ చేయాలని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి బీఆర్ఎస్ తలపెట్టిన రైతు ధర్నా శిబిరంపై కాంగ్రెస్ మూకలు చేసిన దాడిపై విచారణ సజావుగా సాగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం కాంగ్రెస్ గూండాలు దాడికి దిగిన ఘటనలో పోలీసుల పాత్ర కూడా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తున్నది. కాంగ్రెస్ శ్రేణులు రాళ్లు, గుడ్లు విసురుతూ దాడికి పాల్పడుతుండగా వారిని నివారించకపోగా పోలీసులే బీఆర్ఎస్ దీక్షా శిబిరం టెంట్లను కూల్చివేయడం విస్మగొల్పుతున్నది.

తిరుమలగిరిలో బీఆర్ఎస్ దీక్షా శిబిరంపై కాంగ్రెస్ చేసిన దాడితో పదేండ్ల పాటు ప్రశాంతంగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం ఉలిక్కిపడింది. ప్రధానంగా దాడులకు పాల్పడే వారికి పోలీసుల సహకారం ఉందని తెలుస్తుండడంతో భవిష్యత్ ఎలా ఉంటుందోననే భయాందోళనలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ పాలనలో గత పదేండ్లలో గాదరి కిశోర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఒక్క దాడి కూడా లేకపోగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఇలాంటి దారుణాలు జరుగడంపై జనం చర్చించుకుంటున్నారు. సొంత పార్టీ నేతలే ఇసుక మాఫియా, కాంట్రాక్ట్ మాఫియా అంటూ స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తుండగా.. మరోవైపు ఎనిమిది నెలల కాలంలో బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. దీక్షా శిబిరంపై దాడికి పాల్పడే వారికి సహకారం అందించిన పోలీసులు బాధితులకు ఎలా న్యాయం చేస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ దాడులను ప్రోత్సహిస్తూ టెంట్లు కూల్చిన పోలీసులను రక్షించేందుకు కాంగ్రెస్ నియోజకవర్గ బాస్ రాష్ట్ర పెద్దలతో ఒత్తిడి తెస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, నిన్నటి ఘటనకు సంబంధించి ఇరు వర్గాలు ఫిర్యాదులు చేయగా.. కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు పోలీసులు కేసులు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కేసులు నమోదు చేయనున్నట్లు చెప్తున్నారు. దాడికి దిగిన కాంగ్రెస్ గుంపులో దాదాపు 50మందికిపైనే ఉంటే కేవలం ఆరుగురిపై కేసు నమోదు చేయడం పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏఎమ్మార్పీ కాల్వ

ఏఎమ్మార్పీ చివరి భూములకు వచ్చే నెలలోనే సాగునీరు

ఈ నెలాఖరుకు మోటారు రిపేర్ పూర్తి

- ఆ తర్వాతే పూర్తిస్థాయిలో సాగునీరు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : నాగార్జునసాగర్‌లో నిండా నీళ్లున్నా పాలకుల పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యంతో ఏఎమ్మార్పీ పరిధిలోని చెరువులు, కుంటలకు నీరు చేరక ఆయకట్టులో భూములు బీళ్లుగానే ఉన్నవైనంపై ఈ నెల 20న నమస్తే తెలంగాణలో 'ఎండుతున్న ఏఎమ్మార్పీ ఆయకట్టు' శీర్షికన ప్రచురించిమైన కథనం రైతాంగంలో చర్చనీయాంశమైంది. దాంతో ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ అందుకు కారణాలను తెలిపే ప్రయత్నం చేస్తూ సుదీర్ఘ వివరణ పంపారు. ఏఎమ్మార్పీ పుట్టుపూర్వోత్తరాల నుంచి మొదలుపెట్టి ప్రస్తుతం ఒక మోటార్ రిపేర్‌లో ఉందంటూ ముగించారు. మోటార్ రిపేర్ ఆలస్యానికి కారణం ఏంటన్నది మాత్రం అందులో వెల్లడించలేదు. ఈ మోటర్ రిపేర్‌ను సకాలంలో చేయకపోవడం వల్లే నాగార్జునసాగర్ నిండి నీళ్లన్నీ సముద్రం పాలవుతున్నా ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీరు అందడం లేదన్నదే నమస్తే తెలంగాణ కథనం ప్రధాన ఉద్దేశం. సాధారణంగా వ్యవసాయంలో పంటలు వేయడానికి, వివిధ దశల్లో పంటల సస్యరక్షణకు సరైన సమయం లేదా అదును అనేది చాలా ముఖ్యం. కానీ అధికారులు మాత్రం సాగర్ నిండా నీళ్లున్నాయి.. తొందరేం లేదు.. త్వరలోనే చివరి భూములకు నీళ్లిస్తామంటూ సింపుల్‌గా తేల్చేస్తుండడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అసలే గతేడాది సరైన వర్షాల్లేక సాగర్ నిండక ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలో నీళ్లు ఇవ్వక భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. గత వేసవిలో వరి సంగతి దేవుడెరుగు.. పండ్ల తోటలను రక్షించుకునేందుకు కూడా రైతులు నానా తంటాలు పడ్డారు. తీవ్ర నీటి కరువులో ఉన్న రైతులు సాగర్‌లోకి వరద నీరు వస్తుంటే... కరువు తీరా నీళ్లొస్తున్నాయని సంబురపడ్డారు. కానీ వారి సంతోషానికి పాలకుల పర్యవేక్షణ లోపం, అధికారుల నిర్లక్ష్యం అడ్డంకి మారింది. ఏఎమ్మార్పీలో నాలుగు మోటార్లు ఉంటే వాటిని సీజన్ ప్రారంభం నాటికే సిద్ధం చేసుకోవాల్సి ఉన్నా అలా జరుగలేదు. రెండు నెలలుగా యూనిట్-1 మోటార్ రిపేర్‌లో ఉండగా, నేటికీ అందుబాటులోకి రాలేదు. ఈ నెల 31 నాటికి రిపేర్ పూర్తి చేసి పూర్తి స్థాయిలో సాగునీటిని విడుదల చేయనున్నట్లు ఏఎమ్మార్పీ ఇరిగేషన్ సబ్ డివిజన్-3, అక్కంపల్లి డీఈఈ పి.నాగయ్య 'నమస్తే తెలంగాణ' కథనంపై స్పందిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మూడు మోటార్ల ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని, అందులో 525 క్యూసెక్కుల నీరు జంట నగరాలకు తాగునీటి కోసం, 45 క్యూసెక్కుల నీరు మిషన్ భగీరథ కోసం, 1,210 క్యూసెక్కుల నీరు జిల్లాలోని తాగు, సాగునీటికు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 31 నాటికి మొత్తం నాలుగు మోటార్లను రన్ చేసి ఏఎమ్మార్పీ చివరి ఆయకట్టుకు సాగునీటితో పాటు చెరువులను నింపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా నీటిని ఇవ్వాల్సిన డిస్ట్రిబ్యూటరీ-7(బి)కి సరైన నీటిమట్టం లేనందుకు ఇవ్వలేకపోతున్నట్లు ఒప్పుకొన్నారు. ప్రస్తుతం అక్కంపల్లిలో 242 అడుగుల వాటర్ లెవల్ ఉందని, 243.70 వాటర్ లేవల్ ఉంటేనే డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని 5,200 ఎకరాలకు సాగునీరు ఇవ్వగలమని తెలిపారు. దాంతో ఏమ్మార్పీ పరిధిలో చెరువులు నిండాలన్నా, సాగునీరు రావాలన్నా, వచ్చే నెల మొదటి వారం వరకు రైతులు వేచిచూడక తప్పదని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నట్లు స్పష్టమతున్నది.

మూడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి, ఆగస్టు 23 : మూసీ ప్రాజెక్టుకు శుక్రవారం ఎగువ ప్రాంతాల నుంచి 2,627.64 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా మూడో రోజు కూడా దిగువకు నీటి విడుదల చేశారు. ఒక్కో గేటును ఒక అడుగు మేర ఎత్తి 1,943.04 క్యూసెక్కులు, కుడి కాల్వకు 168.52, ఎడమ కాల్వకు 216.67 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తం 2,388.45 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు) అడుగులకుగానూ ప్రస్తుతం 643.72(4.12 టీఎంసీలు)అడుగులు ఉన్నట్లు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

రైతులకు ఉపయోపడేలా నూతన రెవెన్యూ చట్టం

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ గుత్తా

నీలగిరి, ఆగస్టు 23 : ప్రస్తుత 2020 రెవెన్యూ (ఆర్ఓఆర్) చట్టం వల్ల కలిగే ఇబ్బందులను తొలగించి రైతులకు ఉపయోగకరమైన చట్టాన్ని తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్ఓఆర్-2024 చట్టాన్ని తయారు చేస్తున్నదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ హక్కుల రికార్డుల బిల్లు-2024 ముసాయిదాపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులను పరిష్కరించే అవకాశం చట్టంలో ఉండాలని, అలాగే తప్పులను సవరించే అవకాశం కల్పించాలని, కానీ 2020లో ఏర్పాటు చేసిన చట్టంలో అప్పీళ్లకు అవకాశం లేదని అన్నారు. కొత్త చట్టంలో ఈ అవకాశం కల్పించారని, రానున్న అసెంబ్లీ, శాసన మండలి సమావేశాల్లో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టి అమల్లోకి తీసుకొచ్చేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం వేల సంఖ్యలో బోగస్ పాస్ పుస్తకాలు ఉన్నాయని, పాస్ పుస్తకాలు ఉన్నవాళ్లకు భూములు లేవని, ఇలాంటివన్ని తొలగించి పారదర్శకంగా చట్టాన్ని తీసుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఫైలెట్ మండలంగా ఎంపిక చేశారని చెప్పారు. చట్టాలు మారడం వల్ల వ్యవస్థలు కూలిపోకూడదని, నూతన రెవెన్యూ చట్టంపై అన్ని జిల్లాలో అభిప్రాయాలు సేకరిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇంకా మెరుగైన భూరికార్డుల విధానాన్ని తీసుకొచ్చేందుకు 2020 చట్టం స్థానంలో 2024 చట్టం తెచ్చేందుకు ఆగస్టు 3 నుంచి క్షేత్రస్థాయిలో సూచనలు, సలహాలు తీసుకుంటున్నామన్నారు. ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయనే నమ్మకం తనకుందన్నారు. అనంతరం ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ నూతన రెవెన్యూ చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతిపాదిత రైట్స్ ఆఫ్ రికార్డును వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కల్టెకర్ టి.పూర్ణచంద్ర, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, రిటైర్డ్ తాసీల్దార్ ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, రైతులు, మేధావులు, రామచంద్రరావు, పన్నాల గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, నారాయణరావు, వీరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు భూ సేకరణ ప్రతిపాదనలు పంపించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, ఆగస్టు 23 : ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూములకు భూసేకరణ ప్రతిపాదనలను పంపించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తన చాంబర్ నుంచి శుక్రవారం ఆయన లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణపై నీటి పారుదల, రెవెన్యూ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని డివిజన్ల పరిధిలో చేపట్టనున్న లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి అవసరమయ్యే భూముల పూర్తి వివరాలతో ప్రతిపాదనలు పంపిచాలని, ఎక్కడైనా ప్రభుత్వ భూములు అసైన్డ్ భూములు ఉన్నట్లయితే వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టా భూములు ఉంటే సంప్రదింపులు చేసి నిబంధనల ప్రకారం భూములను సేకరిస్తామని చెప్పారు. మిర్యాలగూడ డివిజన్‌లో నెల్లికల్ స్టేజ్ 1కు సంబంధించి 7.4 ఎకరాలకు వారం లోపు సీఎన్ జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సోమవారం నుంచి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్త తనిఖీకి బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

దేవరకొండ డివిజన్ పరిధిలో అంబాభవానీ, కంబాలపల్లి, పొదిళ్ల లిఫ్ట్‌లకు వెంటనే భూసేకరణపై ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆర్డీఓలు భూసేకరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఫిర్యాదుల వెల్లువ

కట్టంగూర్ మండలంలో 10వేల మందికి గానూ 5వేల మందికే రుణమాఫీ

వ్యవసాయ కార్యాలయానికి అన్నదాతల బారులు

కట్టంగూర్, ఆగస్టు 23 : పంట రుణమాఫీపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. వారం రోజులుగా కట్టంగూర్ వ్యవసాయ కార్యాల యం, రైతువేదికల చుట్టూ రైతులు వరుస కడుతున్నారు. గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమకు రుణమాఫీ వర్తింస్తుందా లేదా అని అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. రెండు లక్షల రూపాయల కంటే తక్కువ అప్పు తీసుకున్నా తమకు రుణమాఫీ కాలేదని చాలామంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్టంగూర్ మండలంలో 10వేల మంది రైతులకుగానూ సుమారు 5వేల మందికే మూడు విడుతల్లో రుణమాఫీ అయ్యింది. మిగతా 5వేల మందికి పలు నిబంధలన కారణంగా నిలిపివేశారు. దాంతో రుణమాఫీ కాని రైతుల కోసం వ్యవసాయ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడంతో దరఖాస్తులు ఇచ్చేందుకు రైతులు బారులుదీరుతున్నారు. రేషన్ కార్డు లేకపోవడం, పేరు తప్పులు ఉండడటంతోపాటు ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ బ్యాంకుల్లో అనుసంధానం చేయకపోవడం వంటి కారణాలతో రుణమాఫీ కాలేదు. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సహకార బ్యాంకుల్లో అనేక చోట్ల గడువు తేదీల కంటే ముందే రుణాలు తీసుకున్నా..సిబ్బంది ఆలస్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో మాఫీ కాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధి చేకూర్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

షరతులు పెట్టడం సరికాదు

ప్రభుత్వం రుణమాఫీకి షరతుల పేరుతో రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నది. ఎటువంటి షరతులు లేకుండా రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు నబంధనలు పెట్టడం బాధాకరం. నేను కట్టంగూర్ ఏపీజీవీబీలో 1.60లక్షల రుణం తీసుకొని ప్రతి సంవత్సం రెన్యూవల్ చేసుకుంటున్నా. రుణమాఫీ లిస్టులో నాపేరు లేకపోవడంతో అధికారులను అడిగితే రేషన్‌కార్డు లేకపోవడంతో మాఫీ కాలేదని చెబుతున్నారు. రెండు లక్షలు రుణం తీసుకున్న రైతులకు నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలి.

-పాదూరి శిశుపాల్‌రెడ్డి రైతు, కల్మెర, కట్టంగూర్ మండలం

కట్టంగూర్ వ్యవసాయ కార్యాలయంలో దరఖాసుల్తు అందజేస్తున్న రైతులు

కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుంది

రెండు లక్షల రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులను ఘోస పెడుతున్నది. రుణమాఫీని రైతులకు ఎలా ఎగ్గొట్టాలని నానారకాల రూల్స్ పెడుతున్నది. నాపేరు మీద లక్షా యాభై వేలు, మా అమ్మ పేరుమీద 90వేల రూపాయలు పంట రుణం తీసుకున్నాం. రుణమాఫీ అవుతుందని ఎంతో ఆశతో ఎదురుచూశాం. ఇద్దరం ఒకే రేషన్‌కార్డులో ఉన్నామని లింక్‌తో మాఫీ కాలేదు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మే పరిస్థితి లేదు. రైతును ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం నిలబడలేదు. రేపు వీరి పరిస్థితి కూడా అంతే. కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తగులుతుంది.

-అడప వెంకటేశ్వర్లు, రైతు, ఇర్కిగూడెం, మిర్యాలగూడ టౌన్


రుణమాఫీ కోసం నల్లగొండ మండలం దోమలపల్లి బ్యాంక్‌లో బారులుదీరిన రైతులు

రుణమాఫీ రైతుకు కన్నీరే మిగిల్చింది

రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కన్నీరే మిగిల్చింది. నాకు నా భార్య పేరు మీద రెండు లక్షల వరకు పంట రుణం ఉంది. మాఫీ వస్తుందిలే అని సంతోషపడ్డాం. ప్రభుత్వం ఇచ్చిన మూడు లిస్టుల్లో మా పేరు లేకపోవడంతో ఎంతో బాధ పడ్డాం. ఈ ప్రభుత్వం కొందరకే మాఫీ చేసి చేతులు దులుపుకుంది. సీఎం, మంత్రులు రుణమాఫీపై పూటకోమాట మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం.

-తరి రమేశ్, పూసలపాడు, రైతు, మాడుగులపల్లి మండలం

రుణమాఫీపై మంత్రుల మాటలతో రైతుల్లో గందరగోళం

కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి మాటతప్పింది. లేనిపోని కారణాలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ విషయంలో మంత్రులు తలో రకంగా మాట్లాడుతూ రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారు. మా ఇంటిలో నా పేరు మీద మాత్రమే రుణం తీసుకున్నా. అయినా నాకు రుణమాఫీ కాలేదు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ఈ సమయంలో మాఫీ కాని రైతులు బ్యాంకులు, ఏఓల చుట్టూ తిరుగడం ఇబ్బందిగా ఉంది. వెంటనే రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న వారందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి.

-పాలేటి రామారావు, మాజీ రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, రామాపురం, మేళ్ల చెర్వు

తెలువదు అంటుండ్రు

మా ఊర్లో రెండున్నర ఎకరాల భూమి ఉన్నది. ఇండియన్ బ్యాంకులో లక్షా50 వేలు లోను తీసుకున్నా. సర్కారోళ్లు రూ. రెండు లక్షల రుణం మాఫీ అవుతుందంటే ఎంతో సంబురపడ్డా. పాసు బుక్కు పట్టుకొని బ్యాంకుకు పోతే లిస్టులో నీ పేరు లేదన్నరు. మాకేం తెలియదు అని బ్యాంకు సారు చెప్పిండు. సరిగా చూడండి అని చెబితే లేదమ్మా నీ పేరు లేదు విసికించకు అన్నడు. ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియడం లేదు. కొంత మందికి రుణమాఫీ చేయడం బాగా లేదు. నాకు మస్తు బాధ కలుగుతుంది.

-మైల ఆండాలు, బ్రాహ్మణ వెల్లెంల, నార్కట్‌పల్లి మండలం

చిత్రియాల అంకాలమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

చింత్రియాలలో జన జాతర

చందంపేట, ఆగస్టు 23 : మండలంలోని చిత్రియాల గ్రామంలోని అంకాలమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే జాతరలో చివరి రోజు శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొదటి రోజు ప్రతి ఇంటి నుంచి మొక్కులు తీర్చుకున్నారు. రెండో రోజు శోభాయాత్ర నిర్వహించగా, మూడో రోజు దేవాలయంలో అమ్మవారి ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ కాకనూరి రంగయ్య, మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, పాపయ్య, రాములుగౌడ్, బందెల తిరుపతయ్య, మోహనయ్య, రజని, వెంకటయ్య, ప్రసాద్, నారాయణ, నిరంజన్ పాల్గొన్నారు.